
అవినీతిపై అక్షర సమరం
మన అంకుశం
సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 234 | బుధవారం 23 ఏప్రిల్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-

# ఆ కేసు కొట్టేయండి



- హైకోర్టులో సీఎం రేవంత్ రెడ్డి పిటిషన్
- నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టేయాలని పిటిషన్
- బీజేపీకి పరువు నష్టం కలిగేలా రేవంత్‌రెడ్డి మాట్లాడారని ఫిర్యాదు

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్:**

ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసు కొట్టివేయాలని పిటిషన్‌లో కోరారు. గత సంవత్సరం ఎన్నికల ప్రచారంలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెంలో కాంగ్రెస్ నిర్వహించిన సభలో రేవంత్ రెడ్డి చేసిన ప్రసంగంపై బీజేపీ నేత కాసం వెంకటేశ్వర్లు పరువు నష్టం దావా వేశారు. బీజేపీకి పరువు నష్టం కలిగేలా రేవంత్ రెడ్డి మాట్లాడారంటూ ఫిర్యాదు చేశారు. కాసం పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన ప్రజాప్రతినిధుల కోర్టు విచారణలో భాగంగా సాక్షుల వాంగ్మూలం నమోదు చేసింది. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల టైంలో చెప్పారని కాసం కాసం వెంకటేశ్వర్లు పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ పిటిషన్‌పై ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. ఈ నేపథ్యంలో రేవంత్ రెడ్డి ప్రసంగం వీడియో , ఆడియో క్లిప్పింగ్‌లను సైతం కాసం కోర్టుకు సమర్పించారు. దీంతో విచారణలో ఉన్న ఈ కేసును కొట్టేయా లని సీఎం హైకోర్టును ఆశ్రయించారు. కేసు విచారణ చేపట్టవద్దని, మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాగే, కోర్టు హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని కోరారు.



## ఏపీ టెన్త్ ఫలితాలు..
# బాలికలదే పైచేయి

### 93.90 శాతంతో అగ్రస్థానంలో మన్యం జిల్లా
### చివరి స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా

**(అంకుశం, అమరావతి, ఏప్రిల్ 23):**

ఏపీ పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 81.14 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పరీక్షలకు మొత్తం 6,14,459 మంది విద్యార్థులు హాజరుకాగా.. వీరిలో 4,98,585 మంది పాసైనట్లు మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఉత్తీర్ణులైన విద్యార్థులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఫలితాల్లో 93.90 శాతం ఉత్తీర్ణతతో పార్వతీపురం మన్యం జిల్లా అగ్రస్థానంలో ఉండగా.. అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది. బాలికల్లో 84.09 శాతం, బాలురలో 78.31 శాతం పాసయ్యారు. 1,680 పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. మే 19 నుంచి 28 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. కాకినాడ విద్యార్థినికి 600/600 మార్కులు కాకినాడ నగరంలోని భాష్యం పాఠశాలకు చెందిన నేహాంజని అనే బాలికకు 600/600 మార్కులు వచ్చాయి. మరోవైపు ఎలమంచిలి శ్రీచైతన్య స్కూల్‌లో చదువుతున్న ఎండ అనీష అనే విద్యార్థిని 599 మార్కులు సాధించింది. పల్నాడు జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి 598 మార్కులు వచ్చాయి. ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న పావని చంద్రిక ఈ ఘనత సాధించింది.

## కూటమి పాలనలో స్కీమ్‌లు కాదు..
# స్కామ్‌లు పెరిగాయి

**రాజమండ్రిలో అవినీతి జరగకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నాను**

**బెల్ట్ షాపులు, మద్యం దుకాణాల వద్ద అనధికార పర్మిట్ రూములు విషయంలో కచ్చితంగా ఆందోళన చేస్తాం**

**రాజమండ్రిలో మెజారిటీ రావడానికి నీ గొప్పతనం నీ కుటుంబం గొప్పతనం కాదు.**

**తూర్పుగోదావరి**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు మాజీ ఎంపీ మార్గాని భరత్. కూటమి ప్రభుత్వంలో స్కీములు అమలు చేయ డం లేదను కానీ స్కాములు చేస్తున్నా రని అన్నారు. చంద్రబాబు చెప్పారు కదా అని అధికారులు ఆలోచిం చకుం డా అరెస్టులకు పాల్పడితే కచ్చితంగా భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ మాజీ ఎంపీ - మిగతా3లో



# మజ్లిస్ వర్సెస్ బీజేపీ

**ముగిసిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్**

**77.56 శాతం నమోదైన ఓటింగ్**

**ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్**

**ఈ నెల 25న ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి**



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 4 గంటల వరకు కొనసాగింది. మొత్తం 112 ఓట్లకు గాను 88 ఓట్లు పోలయ్యాయి. ఈ ఎన్నికల్లో 77.56 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. బీఆర్ఎస్ మినహా బీజేపీ, కాంగ్రెస్, మజ్లిస్ పార్టీల ప్రజాప్రతినిధులు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఈ నెల 25న ఓట్ల లెక్కింపు జరగనుండగా, అదే రోజు ఫలితాలు - మిగతా3లో

# ఉగ్రవాదానికి భారత్ తలొగ్గదు

- ఈ ఘాతుకానికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోం



# టీపీసీసీలో ప్రక్షాళన!

- పార్టీ ప్రక్షాళనకు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ దిశానిర్దేశం
- పరిశీలకులకు మూడు దశల్లో టాస్క్ నిర్దేశించాం
- 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు
- జిల్లా సమావేశాలకు బ్లాక్, మండల అధ్యక్షులను ఆహ్వానించాలని సూచన
- టాస్క్ -2లో అసెంబ్లీ, బ్లాక్ లెవెల్ మీటింగ్స్, టాస్క్-3లో మండల మీటింగ్స్



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో టీపీసీసీని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అన్ని కార్యవర్గాల కూర్పు ఉంటుందని చెప్పారు. గాంధీభవన్‌లో బుధవారం తెలంగాణ రాష్ట్ర పరిశీలకుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. పార్టీ ప్రక్షాళనకు ఏఐసీసీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ దిశానిర్దేశం చేశారని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. పరిశీలకులకు మూడు దశల్లో టాస్క్ నిర్దేశించామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఏప్రిల్ 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు జిల్లా స్థాయి సమావేశాలు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశామని అన్నారు. జిల్లా సమావేశాలకు బ్లాక్, మండల అధ్యక్షులను ఆహ్వానించాలని సూచించారు. ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోటీ చేసిన అభ్యర్థులు, ఏఐసీసీ, పీసీసీ ఆఫీస్ బేరర్లు, జిల్లా స్థాయి సీనియర్ నాయకులను ఆహ్వానించాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. టాస్క్ -2లో అసెంబ్లీ, బ్లాక్ లెవెల్ మీటింగ్స్, టాస్క్-3లో మండల మీటింగ్స్ ఏర్పాటు చేయాలని అన్నారు. జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమాలు - మిగతా3లో

## టెన్త్‌లో పూలే గురుకుల
# విద్యార్థుల హవా

- 95 శాతం ఉత్తీర్ణతతో టాప్ లేపిన బీసీ విద్యార్థులు
- 29 స్కూళ్లో 100 శాతం ఫలితాలు
- ఈ విజయం సీఎం చంద్రబాబుదే
- బీసీ విద్యార్థుల ఫలితాలపై మంత్రి సవిత హర్షం



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

పదో తరగతి పరీక్షల్లోనూ మహాత్మా జ్యోతిరావు పూలే(ఎంజేపీ) బీసీ గురుకుల విద్యార్థులు టాప్ లేపారు. బుధవారం విడుదలైన టెన్త్ పరీక్షల్లో ఎంజేపీ బీసీ స్కూల్ విద్యార్థులు 95 శాతం మేర ఉత్తీర్ణతీ సాధించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షల్లోనూ ఎంజేపీ విద్యార్థులు ప్రభంజనం సష్టించిన విషయం విధితమే. ఎంజేపీ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రస్థాయి ఉత్తీర్ణత కంటే అధికంగా ఎంజేపీ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అధికంగా ఉండడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. రాష్ట్ర స్థాయి ఫలితాల్లో 81.14 శాతం మేర ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ ఫలితాల్లో బీసీ వెల్ఫేర్ కు చెందిన ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా 102 ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,788 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 95 శాతం మంది పాసయ్యారు. ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కు చెందిన 11,819 - మిగతా3లో

# కూటమి పాలనలో స్కీమ్‌లు కాదు.. స్కామ్‌లు పెరిగాయి

-మొదటిపేజీ తరువాయి

మార్గాని భరత్ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. ఉర్సా కంపెనీ ద్వారా వేల కోట్ల రూపాయలు విలువైన భూములను అన్యాక్రాంతం చేసే ప్రయత్నం చేస్తోంది కూటమి ప్రభుత్వం. ఇది అధికార దుర్వినియోగం కాదా?. నీతి నిజాయితీలకు మారుపేరైన ఐపీఎస్ అధికారి సీఎస్ఆర్ ఆంజనేయులను అరెస్టు చేయటం దారుణం. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోంది. జిందాల్ లాంటి సంస్థలను అవమానపరుస్తుంది. దావోస్ వెళ్ళిన చంద్రబాబు ఒక్క రూపాయి అయినా ఎంఓయూ చేసుకోగలిగారా?.



ఉర్సా భూముల స్కామ్ నుండి ప్రజలను డైవర్ట్ చేయటానికి మాజీ ఏపీఎస్ ఆఫీసర్ సిఎస్సార్ ఆంజనేయులును అరెస్టు చేశారు. చంద్రబాబు చెప్పారు కదా అని అధికారులు ఆలోచించకుండా అరెస్టులకు పాల్పడితే కచ్చితంగా భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. 40 ఏళ్ల రాజకీయ చరిత్రలో చంద్రబాబు ఒక్క ప్రభుత్వం మెడికల్ కాలేజ్ కూడా రాష్ట్రానికి తీసుకురాలేదు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుకు ధారాదత్తం చేయడం ఏమిటి?. రాజమండ్రిలో అవినీతి జరగకుండా కాపాడే ప్రయత్నం చేస్తున్నాను. నగరంలో అధికార పార్టీ నేతలు భూములను కబ్జా చేసే ప్రయత్నాలు అడ్డుకుంటాం. బెల్ట్ షాపులు, మద్యం దుకాణాల వద్ద అనధికార పర్మిట్ రూములు విషయంలో కచ్చితంగా ఆందోళన చేస్తాం. రాజమండ్రిలో మెజారిటీ రావడానికి నీ గొప్పతనం నీ కుటుంబం గొప్పతనం కాదు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసుకు రాజకీయ భిక్ష పెట్టింది వైఎస్ జగన్. వైఎస్సార్‌సీపీ రాజకీయ భిక్ష పెట్టంది. బొల్లినేనిలో మృతి చెందిన యువతికి ప్రభుత్వం తరఫున ఇప్పటివరకూ ఎటువంటి సహాయం అందించలేదు. ఈవీఎం ఎమ్మెల్యేకు ఇంగ్లీషే రాదనుకున్నాను.. తెలుగు కూడా సరిగ్గా రాదని అర్ధమైంది.. పుట్టినరోజుకి నివాళులర్పించడమేమిటి?. మాల వేసుకుని ఎమ్మెల్యే పచ్చి అబద్దాలు మాట్లాడుతున్నారు. ప్రజా సంబంధాల వ్యవహారాలు సోషల్ మీడియాలో వస్తే కచ్చితంగా స్పందించాలి.

**కూటమి పాలనలో స్కీమ్ లు కాదు.. స్కామ్‌లు పెరిగాయి**

ప్రైవేట్ ఆసుపత్రిల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్యం జరుగుతుందా?. ప్రైవేట్ వ్యక్తుల ఆధ్వర్యంలో మద్యం అమ్మకాలు చేపడుతూ.. స్కాంను గత ప్రభుత్వానికి అంటకట్టడం దారుణం. చంద్రబాబు సమయంలోనే కొత్త డిస్టరీలకు అనుమతులు వచ్చాయి. లిక్కర్ వ్యవహారంతో సంబంధంలేని మిషన్ రెడ్డిని ఎందుకు లాగుతున్నారు. ఇవి కేవలం ప్రభుత్వం అనుసరిస్తున్న డైవర్షన్ పాలిటిక్స్ మాత్రమే. ఉర్సా భూముల కుంభకోణాన్ని డైవర్ట్ చేయడానికి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రముఖులను ప్రభుత్వం అరెస్టు చేసే ప్రయత్నం చేస్తోంది. ప్రభుత్వం చేస్తున్న కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలి' అని హెచ్చరించారు.

# కేశినేని బ్రదర్స్ మధ్య వార్

**విజయవాడ :** బెజవాడ రాజకీయాలు మళ్లీ హీటెక్కాయి. కేశినేని నాని, కేశినేని చిన్నిల మధ్య మళ్లీ ట్వీట్ల యుద్ధం మొదలయింది. విశాఖపట్నంలో ఉర్సా క్లస్టర్ కంపెనీకి భూములను కేటాయించడంపై కేశినేని అభ్యంతరం తెలిపారు. ఈ మేరకు చంద్రబాబు నాయుడును ట్యాగ్ చేస్తూ ట్వీట్ చేశారు. ఉర్సా క్లస్టర్ కంపెనీకి ఒక విశ్వసనీయత లేదని, 2025లో స్థాపించిన సంస్థ కావడంతో దానికి అతి తక్కువ ధరకు భూములను కేటాయించడంపై కేశినేని నాని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని తెలిపారు. ఈ సంస్థకు ఇచ్చిన భూముల కేటాయింపులను రద్దు చేయాలని కూడా కేశినేని నాని కోరారు. దీనిపై అనేక విమర్శలు కూడా వెల్లువెత్తుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు... విశాఖపట్నంలో అతి తక్కువ ధరకు ఉర్సా క్లస్టర్ కంపెనీకి అరవై ఎకరాలు కేటాయించడం ఇప్పటికే విమర్శలకు తావిచ్చింది. ఊరూ పేరులేని సంస్థకు అంత విలువైన భూములను ఎలా అప్పగిస్తారని జాతీయ మీడియాలో సయితం కథనాలు ప్రసారమయ్యాయి. 2025లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత స్థాపించిన పరిశ్రమకు అంత పెద్ద సంఖ్యలో భూముల ఎలా కేటాయిస్తారన్న ప్రశ్నలు బాగా వినపడుతున్నాయి. ఈ నేపథ్యంలో నిన్న చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా కేశినేని నాని ఆయనకు బర్త్ డే విషెస్ చెప్పారు. 2024లో తనకు సీటు దక్కకపోవడంతో కేశినేని నాని టీడీపీని వీడి వైసీపీలో చేరారు. వైసీపీ నుంచి పోటీ చేసినా విజయవాడ పార్లమెంటు ప్రజలు మూడో సారి ఆదరించలేదు దీంతో మళ్లీ కేశినేని నాని చంద్రబాబుకు దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారన్న ప్రచారం జరగుతుంది. ఈ నేపథ్యలోనే ఆయన బర్త్ డే కి నిన్న ట్వీట్ చేసి నేడు మరో





ట్వీట్ తో ఆయన సోదరుడు ప్రస్తుత ఎంపీ కేశినేని చిన్ని పితూరీలు చెప్పేందుకు సిద్ధమయ్యారన్న ఆరోపణలు వినపడుతున్నాయి. కేశినేని నాని, కేశినేని చిన్నిలు అన్నదమ్ములయినప్పటికీ ఇద్దరి మధ్య ఆస్తుల వివాదాలతో పాటు రాజకీయ వైరుధ్యాలు ఉండటంతోనే ఈ ట్వీట్ వార్ స్టార్ట్ చేశారంటూ టీడీపీ మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న ఆరోపించారు. ఉర్సా క్లస్టర్ సంస్థ కేశినేని చిన్నికి చెందిందని, దానికి అంత పెద్ద సంఖ్యలో భూములు కేటాయించడాన్ని కేశినాని నాని తప్పు పట్టడం ఇప్పుడు బెజవాడ పాలిటిక్స్ లో హీట్ ను రాజేసినట్లయింది. కేశినేని చిన్నికి సంబంధించిన సంస్థ కాబట్టే తక్కువ ధరకు అరవై ఎకరాల విలువైన భూములను కేటాయించారన్న అర్థం వచ్చే రీతిలో కేశినేని నాని ట్వీట్ చేయడం టీడీపీ నేతల ఆగ్రహానికి గురి చేసింది. అయితే దీనిపై బుద్ధా వెంకన్న మినహా ఎవరూ స్పందించకపోయినా కేశినేని నాని మరోసారి తన సోదరుడు చిన్నిని లక్ష్యంగా చేసుకుని ఈ ట్వీట్ చేశారంటూ పెద్దయెత్తున సోషల్ మీడియాలో టీడీపీ నేతలు ధ్వజమెత్తుతున్నారు. నారా లోకేశ్ పేరును కూడా కేశినేని చిన్ని మద్యం, ఇసుక వంటి కేసుల్లో బయటకు తెస్తున్నారని కూడా కేశినేని నాని ట్వీట్ చేయడం ఇప్పుడు తెలుగుదేశం పార్టీలోనే కాదు.. కూటమి పార్టీల్లోనూ చర్చనీయాంశమైంది. మరోసారి బ్రదర్స్ మధ్య వార్ మళ్లీ మొదలయినట్లేనని విశ్లేషకులు చెబుతున్నారు

# టీపీసీసీలో ప్రక్షాళన!


-మొదటిపేజీ తరువాయి

తెలంగాణలో పెద్ద ఎత్తున విజయవంతం అవుతున్నాయని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. కో ఆర్డినేటర్లు ఇచ్చిన బాధ్యతలను మంచిగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఏఐసీసీ అగ్రనేతలు తెలంగాణలో జరుగుతున్న జై బాపు, జై భీమ్ కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేశారని చెప్పారు. పార్టీ పటిష్టతకు సంస్థాగత నిర్మాణం చాలా కీలకమని మహేష్ కుమార్ గౌడ్ ఉద్ఘాటించారు.

**కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలి: మీనాక్షి నటరాజన్**

కాంగ్రెస్ పార్టీకి చాలా చరిత్ర ఉందని.. బ్రిటిష్ వాళ్లతో కూడా పోరాటం చేసిందని ఏఐసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ తెలిపారు. విస్తృత భావజాలం ఉన్న పార్టీ అని.. జాతీయ స్థాయి ఆలోచనలతో కాంగ్రెస్ పని చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ గాంధీ సిద్ధాంతాలతో నడుస్తుందని తెలిపారు. పార్టీ సిద్ధాంత ప్రచారం, సంస్థాగత పటిష్టత గ్రామస్థాయి నుంచి జరగాలని సూచించారు. ఈ విషయంలో పార్టీ నాయకత్వం చాలా చిత్తశుద్ధితో సీరియస్‌గా పని చేయాలని మీనాక్షి నటరాజన్ ఆదేశించారు.

ప్రస్తుతం గుజరాత్ మోడల్‌గా పార్టీ సంస్థాగత నిర్మాణం చేపట్టాలని నిర్ణయించామని మీనాక్షి నటరాజన్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలు విస్తారంగా జనంలోకి పోవాలని సూచించారు. సిద్ధాంత పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దేశంలోనే మొదటిసారిగా తెలంగాణలో



కులగణన 42 శాతం రిజర్వేషన్లు, ఎస్సీ వర్గీకరణ చేపట్టడం చరిత్రాత్మకమని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రేవంత్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తుచేశారు. దేశంలో మోదీ ప్రభుత్వం, గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టని సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు రేవంత్ ప్రభుత్వం చేపట్టిందని ఉద్ఘాటించారు. ప్రభుత్వం విప్లవాత్మకంగా చేపట్టిన కార్యక్రమాలను మనం ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని మీనాక్షి నటరాజన్ సూచించారు.

## రేపు కూడా భగభగలే..!

## ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్

హైదరాబాద్: తెలంగాణలో నేడు, రేపు భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు రెడ్‌అలర్ట్ ప్రకటించింది. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా టెంపరేచర్స్ నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. రెడ్ అలర్ట్ జారీ చేసిన తొమ్మిది జిల్లాలు మినహా మిగిలిన జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వడగాల్పుల ప్రభావం ఉందని.. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్ మహబూబ్‌నగర్ జిల్లాలకు వడ గాల్పుల హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది.



## టెన్త్‌లో పూలే గురుకుల విద్యార్థుల హవా

-మొదటిపేజీ తరువాయి

పాఠశాలలకు చెందిన 6,14,459 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 102 ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,788 మంది విద్యార్థులకు తమ అదష్టాన్ని పరీక్షించుకున్నారు. వారిలో 95 శాతం మంది పదో తరగతి పరీక్షల్లో పాసైయ్యారు. 29 ఎంజేపీ స్కూళ్లలో వంద శాతం మేర ఉత్తీర్ణత సాధించడం విశేషం. అదే సమయంలో ఎంజేపీ స్కూళ్లో జీరో ఉత్తీర్ణత శాతం నమోదుకాకపోవడం మరో విశేషం. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు పరిశీలిస్తే... ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లతో సమానంగా ఎంజేపీ బీసీ స్కూళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. ఏపీ మోడల్ స్కూళ్లు 84 శాతం, సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు 89.5 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ 67.6 శాతం, కేజీబీవీ పాఠశాలలు 83 శాతం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 71.9 శాతం, ఎయిడెడ్ స్కూళ్లు 73.3 శాతం, మున్సిపల్ పాఠశాలలు 69.3 శాతం, ప్రభుత్వ పాఠశాలలు 62.7 శాతం మాత్రమే ఫలితాలు సాధించాయి. ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు 95 శాతం మేర ఫలితాలు సాధించాయి. వాటితో సమానంగా ఎంజేపీ స్కూళ్లు కూడా 95 శాతం మేర ఫలితాలు సాధించడం విశేషం. టెన్త్ ఫలితాల్లో ఎంజేపీ బీసీ స్కూళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ఎంజేపీ బీసీ స్కూళ్లు ఫలితాలు సాధించాయన్నారు. 29 స్కూళ్లో వంద శాతం పలితాలు రావడంపై ఆమె ఆనందం వ్యక్తంచేశారు.

## భూమి మీద ఎక్కడున్నా వాళ్లను వదిలిపెట్టను

-మొదటిపేజీ తరువాయి

చేస్తామన్నారు. రాష్ట్రం నేరస్థుల అడ్డాగా మారకూడదని.. హత్యలు చేయడం దుర్మార్గమైన పని అని అన్నారు. హత్య కేసును ఛేదించే వరకు పోలీస్ వ్యవస్థ నిద్రపోదన్నారు. రాజకీయ కోణం, వ్యాపారం, ఆయన ఎదుగుదల జీర్ణించుకోలేక పోవడం లాంటి అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు. నేరస్తులు భూమి మీద ఎక్కడ దాక్కున్నా వదిలిపెట్టబోమని తేల్చి చెప్పారు.

**వీరయ్య చౌదరి భౌతిక కాయానికి నివాళులు..**

ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలులో టీడీపీ నేత వీరయ్య చౌదరి భౌతికకాయానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. వీరయ్య చౌదరి కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

## ఏపీ టెన్త్ ఫలితాలు.. బాలికలదే పైచేయి

-మొదటిపేజీ తరువాయి

93.90 శాతం ఉత్తీర్ణతతో పార్వతీపురం మన్యం జిల్లా అగ్రస్థానంలో ఉండగా.. అల్లూరి సీతారామరాజు జిల్లా చివరి స్థానంలో నిలిచింది. బాలికల్లో 84.09 శాతం, బాలురలో 78.31 శాతం పాసయ్యారు. 1,680 పాఠశాలలు శతశాతం ఉత్తీర్ణత సాధించాయి. మే 19 నుంచి 28 వరకు పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నారు. కాకినాడ విద్యార్థినికి 600/600 మార్కులు కాకినాడ నగరంలోని భాష్యం పాఠశాలకు చెందిన నేహాంజని అనే బాలికకు 600/600 మార్కులు వచ్చాయి. మరోవైపు ఎలమంచిలి శ్రీచైతన్య స్కూల్‌లో చదువుతున్న ఎండ అనీష అనే విద్యార్థిని 599 మార్కులు సాధించింది. పల్నాడు జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థినికి 598 మార్కులు వచ్చాయి. ఒప్పిచర్ల జడ్పీ హైస్కూల్‌లో చదువుతున్న పావని చంద్రిక ఈ ఘనత సాధించింది.

## తియ్యని పండ్ల వెనుక చేదు నిజాలు.

**విజయవాడ :** నూజివీడు.. మామిడి పండ్లకు కేరాఫ్ అడ్రస్. నూజివీడు ప్రాంతంలో దాదాపు 40 వేల ఎకరాల్లో మామిడి పంటను సాగు చేస్తున్నారు. ఇక్కడ కాయలు కోయకముందే వ్యాపారులు రైతులతో ఒప్పందం చేసుకొని తోటలను కొనుగోలు చేస్తారు. ఆ పంట వరకు డబ్బులు చెల్లించి.. కోత మొదలు పెడతారు. దీంతో రైతులకు పండ్లతో సంబంధం ఉండదు. కేవలం పండించడమే వారి బాధ్యత.ఇదంతా ఎలా ఉన్నా.. అసలు సమస్య అక్కడే మొదలవుతోంది. వ్యాపారులకు విక్రయించని రైతులు.. పండ్ల పండాక కోసి.. మార్కెట్లకు తరలిస్తారు. కానీ.. వ్యాపారులు కొనుగోలు చేసిన తోటల్లో.. పండ్లు పూర్తిగా పండకముందే.. కోస్తున్నారు. వాటికి రసాయనాలు పూసి.. తొందరగా పక్వానికి వచ్చేలా చేస్తున్నారు. ఇలా చేయడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వాటిని ఇతర పట్టణాలు, నగరాలకు తరలించి విక్రయిస్తున్నారు.రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండ్లను తింటే ఆరోగ్య సమస్యలు బారినపడే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇలాంటి పండ్లను తీసుకోవడం ద్వారా.. క్యాన్సర్, అల్సర్, లివర్, కిడ్నీ, జీర్ణ సంబంధిత వ్యాధులు, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, నరాల బలహీనతలకు గురయ్యే ప్రమాదం ఉంది. కాల్షియం కార్బైడ్ ద్వారా వెలువడే ఎసిటిలిన్ వాయువు.. నాడీ వ్యవస్థ మీద ప్రభావం చూపి తలనొప్పి, దీర్ఘకాలిక మత్తు, శక్తిని కోల్పోయే ప్రమాదముంది. చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి తగ్గి శ్వాస సంబంధిత ఇబ్బందులు తలెత్తుతాయి. 2011 ఆహార భద్రత, ప్రమాణాల నిబంధనలు ప్రకారం.. ప్రభుత్వం కార్బైడ్, ఎసిటిలిన్ రసాయనాలను నిషేధించింది. సహజంగా పండించే ఇథిలిన్‌ను మాత్రమే కొంత వరకు వినియోగించేందుకు అనుమతిచ్చింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం.. సుమారు 20 కిలోల పండ్లకు 5 గ్రాముల ఇథిలిన్‌ను వినియోగించాల్సి ఉంటుంది. మేలిమి పండులా కనిపించేందుకు వ్యాపారులు కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. ఆమోదించిన ఇథిలిన్‌తో పోలిస్తే కార్బైడ్, ఇతర రసాయనాలు మార్కెట్‌లో చౌకగా లభిస్తుండటంతో వీటిని వ్యాపారులు ఇష్టానుసారంగా వాడుతున్నారు.'కృత్రిమంగా పండించిన పండ్లను తిన్న వారికి వాంతులు, విరేచనాలు, దాహం ఎక్కువగా కావటం, కడుపులో తిప్పటం వంటి సమస్యలు వస్తాయి. మామిడి పండ్లను తినే ముందు ఉప్పు నీటిలో కడగాలి. కృత్రిమంగా పండించిన పండ్లను సాధ్యమైనంత వరకు తినకపోవడం మంచిది' అని వైద్య నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

## జోరుగా బెట్టింగ్...

**విజయవాడ :** తెలుగు రాష్ట్రాల్లో బెట్టింగ్ భూతం ఎన్నో కుటుంబాలను రోడ్డున పడేసింది. ఎంతోమంది యువత ఆయుష్షును అర్ధాంతరంగా ముగిసేలా చేసింది. ఇక ఏపీలోని చాలా బార్‌లలో రోజూ బెట్టింగ్ నడుస్తుంది. ప్రతీదగ్గర స్క్రీన్‌లు వేసి బెట్టింగ్‌లు జోరుగా నడిపిస్తున్నారు. దీంట్లో ప్రజా ప్రతినిధులకు కూడా వాటాలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎందుకంటే వాళ్లవే బార్లు, వాళ్లవే బెట్టింగులు అని తెలుస్తోంది. ఉదాహరణకు ఏలూరులో రైల్వే స్టేషన్ సమీపంలో ఓ బార్ ఉంది. ఓపెన్ ఎయిర్ స్క్రీన్ ఏర్పాటు చేసి.. జోరుగా బెట్టింగ్‌కు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది.దీనిపై ఇటీవల తెలంగాణ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంది. ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన వారిపైనా కేసులు నమోదు చేసింది. ఫలితంగా ఆన్ లైన్ బెట్టింగ్ కాస్త తగ్గింది. కానీ.. ఇన్నాళ్లు బెట్టింగ్ దోపిడీకి పాల్పడ్డ ముఠాలు ఇప్పుడు కొత్త దారిని ఎంచుకున్నాయి.ప్రస్తుతం ఐపీఎల్ మ్యాచ్‌లు జరుగుతున్నాయి. ఈ సమయంలో ఆన్ లైన్ బెట్టింగ్‌పై గట్టి నిఘా ఉంది. దీంతో బుకీలు రూట్ మార్చి.. మళ్లీ పాత పద్ధతిని ఎంచుకున్నారు. ఆఫ్ లైన్ బెట్టింగ్ దందా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా ఏపీ-తెలంగాణ సరిహద్దు పట్టణాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి, అశ్వరావుపేట, మధిర, కొత్తగూడెం, బూర్గంపాడు, భద్రాచలం, వైరా ప్రాంతాల్లో గుట్టుగా బుకీలు దందా సాగిస్తున్నారు.ఇటు నల్గొండ జిల్లాలోని హుజూర్‌నగర్, నల్గొండ, సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో ఆఫ్ లైన్ బెట్టింగ్ దందా జోరుగా సాగుతోందని తెలుస్తోంది. ఈ ప్రాంతాలకు అటు ఏపీ నుంచి ఇటు తెలంగాణ నుంచి బెట్టింగ్ రాయుళ్లు వస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా బార్లు, చాయ్ కేఫ్‌లు, రెస్టారెంట్లు, లాడ్జీలు ఆఫ్ లైన్ బెట్టింగ్‌కు వేదికలయ్యాయి. చాలా రోజులుగా పోలీసులు ఈ ఆఫ్‌లైన్ బెట్టింగ్‌పై ఫోకస్ పెట్టడం లేదు. దీంతో బుకీలు రెచ్చిపోతున్నారు.ఆఫ్ లైన్ బెట్టింగ్ స్పాట్‌కు తక్కువ మంది వెళ్తున్నారు. అక్కడ ఉన్న బుకీలు, బ్రోకర్లు అమాయకులకు ఫోన్లు చేసి బెట్టింగ్ పెట్టేలా ప్రోత్సహిస్తున్నారు. దీంతో ఈ విష సంస్కృతి మారుమూల పల్లెలకూ పాకింది. నెలకు రూ.10 వేలు సంపాదించే వారు కూడా క్రికెట్ బెట్టింగ్‌కు బానిసలవుతున్నారు. బాల్ టు బాల్, ఓవర్ టు ఓవర్, వికెట్ టు వికెట్.. ఇలా రకరకాలుగా బెట్టింగ్ నడుస్తోంది. ఇప్పటికే ఎంతోమంది డబ్బులు పోగొట్టుకొని చెప్పలేని తిప్పలు పడుతున్నారు.ఆఫ్‌లైన్ బెట్టింగ్‌లో మోసపోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. అనధికారిక వ్యక్తులు లేదా సంస్థలు బెట్టింగ్ నిర్వహిస్తే, మీ డబ్బును కోల్పోయే ప్రమాదం ఉంది. గెలిచినప్పటికీ, వారు చెల్లించకపోవచ్చు. ఆఫ్‌లైన్‌లో ఎంత మొత్తం బెట్ వేస్తున్నారో ట్రాక్ చేయడం కష్టం.

## కళ్యాణదుర్గం సబ్ రిజిస్టర్ కార్యాలయం లో
# అవినీతి ఉద్యోగస్తుల పై చర్యలు తీసుకోవాలి

- ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ నారాయణస్వామి ఆస్తులపై ఏసీబీ విచారణ జరిపించాలి
- శివ శంకర్ నాయక్ రాష్ట్ర అధ్యక్షులు గిరిజన సంక్షేమ సంఘం



**అంకుశం న్యూస్ కళ్యాణదుర్గం ఏప్రిల్ 23:** అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం సబ్ రిజిస్టర్ ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తూ అడ్డదారుల్లో విచ్చలవిడిగా డబ్బు సంపాదిస్తున్నటువంటి కళ్యాణ్ దుర్గం సబ్ రిజిస్టర్ కార్యాలయం ఉద్యోగస్తులపై చర్యలు తీసుకోవాలని శివ శంకర్ నాయక్ రాష్ట్ర అధ్యక్షులు GVSS (గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం) డిమాండ్ చేశారు బుధవారం కళ్యాణదుర్గంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ కార్యాలయంలోని అవినీతికి అడ్డుకట్ట వేయడం ఎవరి వల్ల కావడం లేదని గతంలో పనిచేసిన సబ్ రిజిస్టర్ కూడా అక్రమ లేఔట్లు, ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్ల విషయంలో భార్య అవినీతికి పాల్పడి సస్పెండ్ అయిన విషయం మర్చిపోకముందే ప్రస్తుతం సబ్ రిజిస్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నటువంటి ఇంచార్జ్ సబ్ రిజిస్టర్ నారాయణస్వామి కొంతమంది డాక్యుమెంట్ రైటర్లను తన ఏజెంట్లుగా పెట్టుకొని వారి ద్వారా భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారని మొన్న జరిగినటువంటి సంఘటనలు గమనిస్తుంటే అన్ని తెలుస్తున్నాయి నిన్నటికి నిన్న సురేష్ బాబు అనే వ్యక్తి వద్ద నుండి చలానా కు కట్టాల్సిన డబ్బు కంటే అధికంగా డబ్బులు కట్టించుకుని ఆయనకు తీవ్ర నష్టం కలిగించడం జరిగింది ఇటువంటి సంఘటనలు చాలా ఉన్నాయి కాబట్టి వీటి అన్నిటి పైన పూర్తిస్థాయిలో విచారణ జరిపించాలని లేనిపక్షంలో ప్రజాసంఘాలు అన్నిటితో కలిపి పెద్ద ఎత్తున అందాల కార్యక్రమం చేపడతామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంక్షేమ సంఘం నాయకులు ప్రసాద్ నాయక్ మనోజ్ తదితరులు పాల్గొన్నారు

## కనీస మద్దతు ధరకు రాగులు కొనుగోలు ప్రారంభం

- రేపటి నుంచి అన్ని మండలాల రైతు సేవ కేంద్రాల వద్ద
- జిల్లా సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్



**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి, ఏప్రిల్ 23:** శ్రీ సత్య సాయి జిల్లా లో రబీ సీజన్ నందు రాగి పంటను సాగు చేసిన రైతులు వద్ద నుండి ఆంధ్ర ప్రదేశ్ పౌర సరఫరాల సంస్థ ద్వారా కనీస మద్దతు ధర అనగా క్వింటాలకు రూ.4290/- (అక్షరాలా నాలుగు వేల రెండు వందల తొంబై రూపాయాలు) మద్దతు ధరను చెల్లించి రేపటినుండి రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేపట్టనున్నట్లు సంయుక్త కలెక్టర్ అభిషేక్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో రాగి సాగు చేసిన అన్ని రైతు సేవా కేంద్రాల నందు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రాధమిక వ్యవసాయ సహకార సంఘాల ద్వారా కొనుగోలు ప్రారంభించింది. ఈ రబీ సీజన్లో రాగి పంటను ఈ క్రాప్ లో నమోదు చేసుకుని ప్రభుత్వానికి పంటను అమ్మదలుచుకున్న రైతులు గ్రామ వ్యవసాయ సహాయకుడిని సంప్రదించి వివరాలు నమోదు చేసుకొనవలెనని తెలియ చేయడమైనది. అంతే కాకుండా ప్రభుత్వం వారు పౌర సరఫరాల సంస్థ ద్వారా రైతులకు గోనె సంచులు, లోడింగ్ చార్జీలు మరియు రవాణా చార్జీలు కూడా ప్రభుత్వమే భరిస్తుంది. ఇప్పటికే రాగి పంట కోతలు పూర్తిచేసుకుని సిద్ధంచేసుకుని ఉన్న రైతులందరూ ఈ అవకాశన్ని సద్వినియోగం చేసుకొని తక్కువ ధరకు రాగి పంటను అమ్మి నష్టపోకుండా కనీస మద్దతు ధరను పొంద వలెనని పై ప్రకటనలో జాయింట్ కలెక్టర్ తెలిపారు

## ఆత్మహత్యాయత్నం నుండి
# బాలికను రక్షించిన కానిస్టేబులుకు ప్రశంసలు

- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,
- ఆత్మహత్యాయత్నం నుండి బాలికను రక్షించిన కానిస్టేబులు
- జగదీష్ ను అభినందించి, ప్రశంసా పత్రం ప్రదానం చేసిన
- జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,
- డయల్ 112 కాల్ పై సకాలంలో స్పందించి, బాలికను రక్షించిన 2వ పట్టణ కానిస్టేబులు ఆర్.జగదీష్
- ఆత్మహత్యాహత్నం చేసిన బాలికకు కౌన్సిలింగు నిర్వహించిన విజయనగరం 2వ పట్టణ సిఐ శ్రీనివాసరావు



**అంకుశం న్యూస్ విజయనగరం ఏప్రిల్ 23:** విజయనగరం పట్టణం వైఎస్ఆర్ నగర్ ప్రాంతంలోని ఒక అపార్టుమెంటులో ఒకమ్మాయి ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నట్లుగా డయల్ 112కు వచ్చిన ఫిర్యాదుపై, విజయనగరం 2వ పట్టణ కానిస్టేబులు సకాలంలో స్పందించి, 17సం.ల బాలికను రక్షించిన కానిస్టేబులు ఆర్.జగదీష్ ను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఏప్రిల్ 23న జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించి, ప్రశంసా పత్రం అందజేసారు. వివరాల్లోకి వెళ్ళితే.. విజయనగరం పట్టణం వైఎస్ఆర్ నగర్లో నివాసం ఉంటున్న 17సం.ల ఒకమ్మాయి ఇంటిలో తలుపులు వేసుకొని, ఆత్మహత్యాయత్నంకు పాల్పడుతున్నట్లుగా డయల్ 112కు ఫిర్యాదు రాగా, సదరు విషయాన్ని కంట్రోల్ రూం పోలీసులుకు సమాచారం అందించగా, విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనులో.. కానిస్టేబులుగా పని చేస్తున్న ఆర్.జగదీష్ ను సంబంధిత అధికారులు పంపారన్నారు. కానిస్టేబులు ఆర్.జగదీష్, సకాలంలో స్పందించి, సంఘటనా స్థలంకు చేరుకోగా, అప్పటికే సదరు అమ్మాయి ఒక గదిలోకి వెళ్ళి, తలుపు వేసుకొని, ఆత్మహత్యాయత్నంకు పాల్ప - డుతున్నట్లుగా గుర్తించారన్నారు. కానిస్టేబులు ఆర్.జగదీష్ సమయస్ఫూర్తితో వ్యవహరించి, గది తలుపులు పగులుగొట్టి, లోపలకు ప్రవేశించి, ఉరి వేసుకోవడానికి ప్రయత్నిస్తున్న అమ్మాయిని, స్థానికుల సహకారంతో ఆమెను క్రిందకు దించారన్నారు. విచారణలో అమ్మాయి చదవును నిర్లక్ష్యం చేయడం, స్నేహితులతో.. తరుచూ ఎక్కువ సమయం గడుపుతున్నందున తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్యకు యత్నించినట్లుగా గుర్తించి, సదరు అమ్మాయికి 2వ పట్టణ పోలీసులు కౌన్సిలింగు నిర్వహించారన్నారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు. సకాలంలో స్పందించి, ఆత్మహత్యయత్నం నుండి బాలికను రక్షించిన కానిస్టేబులు ఆర్.జగదీష్ ను జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి, సంఘటన జరిగిన తీరును, ఆమెను రక్షించేందుకు తీసుకున్న చర్యలను కానిస్టేబులు జగదీష్ ను అడిగి తెలుసుకొని, ప్రశంసా పత్రం ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, విజయనగరం 2వ పట్టణ సిఐ టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## ఉగ్రదాడులకు ఎన్డీఏ
## ప్రభుత్వం ధీటైన జవాబిస్తుంది

మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్



**అంకుశం న్యూస్ అనంతపురం, ఏప్రిల్ 23 :** తమ దాడులతో భారతదేశంలో సమైక్యతను దెబ్బతీయాలన్న ఉగ్రవాదుల క్రూరమైన ఆలోచనలు ఇక్కడ చెల్లవని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. జమ్మూ కాశ్మీర్లోని బైసారన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హతమార్చడంపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిని ఎన్డీఏ ప్రభుత్వం ఉపేక్షించదని వారు కచ్చితంగా తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఈ ఘటనలో అమాయక ప్రజలు చనిపోవడం చాలా బాధ కల్గించిందన్నారు. వారి కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే దగ్గుపాటి తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కశ్మీర్లో ఇటీవల రికార్డు స్థాయిలో పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో, శాంతిభద్రతలకు విఘాతం కలిగించి ఆ ప్రాంతాన్ని అస్థిరపరిచే కుట్రలు పన్నుతున్నారని అన్నారు. అమాయక పౌరులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా శాంతి విద్రోహ శక్తులు తమ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తున్నాయని ఇలాంటి వాటిని ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా లు ఉపేక్షించరన్నారు. ఉగ్రవాద శక్తులను కూకటి వేళ్లతో పెకిలించేందుకు భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలకు.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మా ప్రభుత్వం ఎప్పటికీ మద్దతుగా నిలుస్తుందన్నారు. పహల్గామ్ ఘటనలో చనిపోయిన వారి ఆత్మలకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

## అనంతలో కదం తొక్కిన సిపిఎం

జమ్మూ కాశ్మీర్ లో అమానవీయ దాడి:-



**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 23:** సిపిఎం. పార్టీ ఆధ్వర్యంలో అనంతపురం నగరంలోని టాప్లెస్ సర్కిల్ నందు ఎర్రసైన్యం కదం తొక్కింది సిపిఎం పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. నిన్నటి రోజు పహాల్గాంలో పర్యాటకులపై ఉగ్రదాడి ని సిపిఎం పార్టీ తీవ్రంగా ఖండించింది. ఉగ్రదాడి లో మృతి చెందిన వారికి సిపిఎం పార్టీ నగర కమిటీ ఆధ్వర్యంలో టవర్ క్లాక్ దగ్గర కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ జమ్మూ కాశ్మీర్ లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి అమానవీయ దాడి అని, పిరికిపందల చర్యని తెలిపారు. ఇలాంటి హింసను తీవ్రంగా ఖండించాలని తెలిపారు. ఇలాంటి దాడులు తీవ్రంగా బాధ కలిగిస్తాయని ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. హింసకు ఎటువంటి ప్రయోజనం లేదని, ఇలాంటి హింసను అన్ని వైపుల నుండి ఖండించాలని ,అమాయక పర్యాటకులపై ఇటువంటి పిరికి దాడులకు నాగరిక సమాజంలో స్థానం లేదని పేర్కొన్నారు. కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు నేరస్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని, దాడిలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు . కాశ్మీర్ అంతా బాగుందని శాంతి భద్రతలు బేషుగ్గా పునరుద్ధరించామని ప్రధాని మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేస్తున్న ప్రచారం పచ్చి బూటకమని ఈ ఉగ్రవాద దాడి తెలియజేస్తుందని సిపిఎం పేర్కొంది. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం సమయాన్ని వృధా చేయకుండా జమ్మూ కాశ్మీర్ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి వర్గ సభ్యులు ముత్తుజ, ప్రకాష్ ,వలీ, గోపాల్ , ఇర్ఫాన్, మసూద్, నగర కమిటీ సభ్యులు జీవ, రాజు, లక్ష్మీనారాయణ, బాలకృష్ణ, వెంకట, నూరుల్ల జాకీర్, నజీర్ ,రామాంజి, శంషాద్, శంకర్, హాజీ వలీ, తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి ఫలితాలలో
# జి.బి.ఆర్ విద్యార్థుల ప్రభంజనం



**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 23:** ఈవిద్యాసంవత్సరంలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో జి.బి.ఆర్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను చూపించి అనపర్తి నియోజకవర్గం లో మొదటి స్థానం సాధించారు. మానుగుల ఎన్. ఎస్. కె. ఎస్. ఆర్.పి. ఎల్. నక్షత్ర 600 మార్కులకు గాను 596 మార్కులతో కర్రి వెన్నెల - 589, అనుసూరి సౌమ్య శ్రీ - 588, మార్ని నిరుపమ సాయి - 587, కర్రి ఆషా సైనిక , కొత్తపల్లి శారద సమన్వితలు - 586, సత్తి హాసితా రిష్మిక - 585, వి. కౌషిక్ - 580 మార్కులు సాధించారు. 94 మంది విద్యార్థులు పరీక్ష రాయగా నూరు శాతం ఉత్తీర్ణులు అయ్యారు. అనపర్తి నియోజకవర్గం లో జి.బి.ఆర్ అగ్రగామిగా నిలిచిందని జి.బి.ఆర్ పాఠశాలల డీన్ జి. హరిప్రసాద్ తెలియజేశారు. 35 మంది 550 పై మార్కులు, 58 మంది 500 పై మార్కులు సాధించారు.ఇంతటి ఘనమైన ఫలితాలను సాధించి పాఠశాల ఘనతను ఇనుమడింపచేసిన విద్యార్థులను, వారిని ఆ విధంగా తీర్చిదిద్దిన అధ్యాపక సిబ్బందిని, జి.బి.ఆర్ విద్యాసంస్థల సెక్రటరీ మరియు కరెస్పాండెంట్ శ్రీ తేతలి ఆదిరెడ్డి (కొండబాబు) అభినందించారు. గ్రామీణ ప్రాంతంలో ఇలాంటి ఫలితాలు చాలా అమూల్యమైనవని అభివర్ణించారు. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు, వారి విజయాలకు కృషి చేసిన అధ్యాపక సిబ్బందిని జి.బి.ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ హెచ్. ఎం. రామారావు , ప్రైమరీ హెచ్. ఎం. భువనేశ్వరి , ప్రీ ప్రైమరీ హెచ్. ఎం. కామాక్షి , ఏసి క్యాంపస్ హెచ్. ఎం. వరలక్ష్మి , మేనేజ్మెంట్ ఇంచార్జి శ్రీ వెంకటరెడ్డి , ఇంచార్జి మహర్షి వెంకటరెడ్డి , అకడమిక్ కో ఆర్డినేటర్ ప్రశాంతిరెడ్డి , ఏవో ఆచారి , గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఇంచార్జి మహీంద్ర ప్రత్యేకంగా అభినందించారు.

## ధర్మవరం లో బీజేపీ నిరసన



**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 23:** నిన్నటి రోజు లిజమ్మూ కాశ్మీర్ లో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడికి నిరసనగాలిధర్మవరం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో పి ఆర్ టిసర్కిల్ లో బుధవారం బీజేపీ ఆధ్వర్యంలోనిరసన చేపట్టారు. కొవ్వొత్తుల ర్యాలీ జరిపారు. ఈ కార్యక్రమం లో ధర్మవరం మంత్రి కార్యాలయం ఇంచార్జి కగ్గోలు హరీష్ బాబు, బీజేపీ పట్టణ అధ్యక్షులు జింకా చంద్ర శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## వై ఎస్ ఆర్ పార్టీ అధినేత
## జగన్ ను కలిసిన జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ళ



**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 23:** వై ఎస్ ఆర్ సి పి తూర్పుగోదావరి జిల్లా అధికార ప్రతినిధి, అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి వై ఎస్ ఆర్ సి పి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని బుధవారం తాడేపల్లి లో కలిసి అనపర్తి నియోజకవర్గ పరిస్థితిని వివరించారు. ఎన్నికల అనంతరం నుండి ఇప్పటివరకు అనపర్తి నియోజకవర్గం లో ప్రతిపక్ష వైఎస్ఆర్ సిపి నాయకులు కార్యకర్తలు సోషల్ మీడియా ప్రతినిధులపై జరుగుతున్న... కక్ష సాధింపు చర్యలు మొదలగు వాటి గురించి అధినేత అడిగి తెలుసుకున్నట్లు దీనిపై అధినేత జగన్మోహన్ రెడ్డి స్పందిస్తూ ఎవరు అధైర్య పడవద్దని ఇప్పటికే నాయకులు జక్కంపూడి రాజా, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, డాక్టర్ సూర్య నారాయణ రెడ్డి మీకు ప్రతి విషయంలోనూ అండగా ఉంటున్నారని, రాష్ట్ర నాయకత్వం కూడా మీకు మీ పోరాటానికి తోడుగా అండగా ఉంటుందని జగన్మోహన్ రెడ్డి తెలిపినట్లు కృష్ణారెడ్డి విలేకరులకు తెలిపారు.

## పదవ తరగతి లో ప్రతిభ
## చూపిన విద్యార్థి రాహుల్ నాయక్



**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 23:** పదవ తరగతి ఫలితాలలో మెరిసిన పేదింటి బిడ్డ నీరాల వంక తండ గ్రామానికి చెందిన రాహుల్ నాయక్ 600/579 మార్కులు రావడం జరిగినది అనంతపురంలో స్థానిక స్కూల్లో చదివి మంచి మార్కులు చదివి తెచ్చుకున్న పేదింటి బిడ్డకు గ్రామస్తులు మరియు పెద్దలు అభినందించడం జరిగింది రాహుల్ నాయక్ ను హిందూపురం టీడీపీ పార్లమెంట్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ కనా వత్ హేమలత భాయ్ అభినందించారు.

## తిరుమలలో భాష్యకారుల ఉత్సవం ప్రారంభం

**అంకుశం న్యూస్ తిరుమల ఏప్రిల్ 23:** తిరుమల శ్రీవారి ఆలయంలో భాష్యకారుల ఉత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. 19 రోజుల పాటు ఈ ఉత్సవం జరుగనుంది. మే 2న శ్రీ భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భగవద్ రామానుజులు విశిష్టాద్వైత సిద్ధాంతపరంగా మీమాంస గ్రంథానికి "శ్రీభాష్యం" పేరుతో వ్యాఖ్యానం చేశారు. అందుకే భాష్యకారులుగా పేరొందారు. శ్రీరామానుజులవారు జన్మించిన అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదీ శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భాష్యకారుల ఉత్సవాల మొదటిరోజున బుధవారం ఉదయం శ్రీవారి ఆలయంలో మొదటి గంట అనంతరం శ్రీ రామానుజులవారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయ్యంగార్లు దివ్యప్రబంధ గోష్ఠి చేపట్టారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

# పదోతరగతిలో స్కూల్ టాపర్ గా గుత్తా రమ్యశ్రీ





**అంకుశం న్యూస్ అనంతపురం, ఏప్రిల్ 23 :** శ్రీ సత్యసాయి జిల్లాలో మండల కేంద్రమైన ముదిగుబ్బలో స్కూల్ టాపర్ గా నిలిచారు గుత్తా రమ్యశ్రీ. రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ బుధవారం విడుదల చేసిన పదవతరగతి పరీక్ష ఫలితాల్లో 589 మార్కులు సాధించారు. మండలంలోని సానేవారిపల్లి గ్రామానికి చెందిన గుత్తా రమ్యశ్రీ ముదిగుబ్బలోని పివిఎస్ పాఠశాలలో పదోతరగతి చదివారు. రమ్యశ్రీ స్కూల్ టాపర్ గా నిలవడమే కాకుండా, మండల స్థాయిలో రెండో ర్యాంకును సాధించారు. విద్యార్థిని తల్లిదండ్రులు గుత్తా దామోదర్ నాయుడు, లావణ్య వ్యవసాయం చేస్తూ కష్టపడి కూతురుని చదివించారు. వారి పెద్ద కూతురు మంజుశ్రీ అనంతపురంలో ఇంటర్మీడియట్ సిబిఎస్ఈ పరీక్షలు రాశారు. తమకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కూడా ఆడపిల్లలను చదివిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు తల్లిదండ్రులు. పిల్లలు కూడా పట్టుదలతో చదివి తల్లిదండ్రుల ఆశలను నెరవేరుస్తున్నారు. పరీక్షలలో మంచి మార్కులు సాధించి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు. ఉన్నత ఆశయ సాధన కోసం శక్తివంచన లేకుండా కృషి సాగిస్తున్నారు. మనోవికాసానికి, సమగ్ర అభివృద్ధికి విద్యాభ్యాసంతో పాటు ఆట పాటలలో కూడా తమ నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నారు. రమ్యశ్రీ పదో తరగతి ఫలితాల్లో సైన్స్, సోషల్ సబ్జెక్టుల్లో 100కు 100 మార్కులు సాధించి తన ప్రత్యేకతను చాటుకున్నారు. మెరుగైన మార్కులు సాధించిన రమ్యశ్రీని సీనియర్ జర్నలిస్టు గుత్తా హరి సర్వోత్తమ నాయుడు, తల్లిదండ్రులను పాఠశాల యాజమాన్యంతో పాటు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, బంధుమిత్రులు ప్రత్యేకంగా అభినందించారు. తనను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు రమ్యశ్రీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## వ్యవసాయ యాంత్రికరణ పథకం ద్వారా
# రైతులకు యంత్రాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే వేగుళ్ళ





**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 23:** వ్యవసాయ యాంత్రికరణ పథకం 2024 - 2025 ద్వారా ప్రభుత్వం రైతులకు సబ్సిడిపై అందిస్తున్న పవర్ టిల్లర్స్, రోటావేటర్స్, ట్రాక్టర్ ఉపకరణాలు, స్ప్రెయర్స్ వంటి యంత్రాలను మండపేట తహశ్శీల్దార్ కార్యాలయం వద్ద రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు బుధవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ అహర్నిశలు కష్టపడుతున్న రైతాంగాన్ని ఆదుకోవలసిన భాద్యత ప్రజలు ఎన్నుకున్నటు వంటి ఆయా ప్రభుత్వాలకు ఉంటుందని ఎమ్మెల్యే వేగుళ్ళ అన్నారు. అందులో భాగంగానే గత వైసీపీ ప్రభుత్వంలో రైతులకు పెండింగ్ పెట్టిన సుమారు 6 వేల కోట్ల రూపాయలను కూటమి ప్రభుత్వం రాగానే రైతులకు చెల్లించటం జరిగిందన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో దాన్యం తోలిన సుమారు 20 రోజులలో రైతులు అందరికీ డబ్బులు చెల్లించేవారన్నారు. ఇది కాస్తా వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 6 నెలల వరకు కూడా పేమెంట్స్ పడని సంధర్భాన్ని అందరం చూశాం అన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వంలో తొలకరి పంటకు మధ్యాహ్నం ఒంటిగంట లోపు ధాన్యం ఎంట్రీ అయితే ఆరోజు సాయంత్రానికి బ్యాంకులో ఎమౌంట్ పడిన విషయాన్ని చూస్తున్నాం అన్నారు. 48 గంటల్లో ఏ ఒక్కటి పెండింగ్ లేకుండా పస్ట్ క్రాఫ్ అంతా పేమెంట్ ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. జిల్లా యంత్రాంగం టార్గెట్ పూర్తిగా ఇవ్వకపోవటంతో రెండవ పంటకు రైతులు కొన్నికొన్ని ఇబ్బందులు పడుచున్నారన్నారు. దీనిపై ఇవాళ అమలాపురంలో జరిగిగే దిశ మీటింగ్ లో చర్చించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రూ.2,31,744/-లు విలువ గల పవర్ టిల్లర్ కు రూ.1,00,000/-లు సబ్సిడి, రూ.1,44,840/-లు విలువ గల రోటావేటర్ కు రూ.46,000/-లు సబ్సిడి, రూ.39,270/-లు విలువ గల ట్రాక్టర్ ఉపకరణాల కు రూ.19,635/-లు సబ్సిడి, రూ.16,993/-లు విలువ గల స్ప్రెయర్ కు రూ.6,728/-లు సబ్సిడి ప్రభుత్వం అందిస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. 25 పవర్ టిల్లర్ లు, 5 రోటావేటర్ లు, 10 ట్రాక్టర్ ఉపకరణాలు, 24 స్ప్రెయర్లు రైతులకు సబ్సిడిపై అందించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## సభ్యత్వ కార్డుల పంపిణీలో
# రాష్ట్రంలోనే అగ్రస్థానంలో ఉన్నాం





- కేఎస్ఎస్ లో కూడా అదే విధంగా పని చేయాలి
- పార్టీ క్యాడర్ కు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన
- ప్రభుత్వానికి-ప్రజలకు వారదిగా పని చేయాలన్న సునీత

**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 23:** తెలుగుదేశం పార్టీ మనకు ఎంతో గౌరవాన్ని, ఎన్నో పదవుల్ని ఇచ్చిందని.. మనం కూడా పార్టీకోసం అదే విధంగా పని చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత క్యాడర్ కు దిశానిర్దేశ్యం చేశారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఆరు మండలాల టీడీపీ నాయకులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. టీడీపీ సభ్యత్వం కార్డుల పంపిణీలో రాప్తాడు నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉందని.. ఇది మీ కృషి వలనే సాధ్యమైందన్నారు. 83వేల 5వందల మందికి సభ్యత్వం తీసుకోగా.. వారిలో 75వేల మందికి పైగా సభ్యత్వం కార్డులు రాగా నిన్నటివరకు సుమారు 40వేలకు పైగా కార్డులు పంపిణీ చేసినట్టు తెలిపారు. అయితే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు ప్రతి నియోజకవర్గంలో కుటుంబ సాధికార సారదుల (కేఎస్ఎస్) నియామకం చేయాల్సి ఉందన్నారు. ఈప్రక్రియ ఇప్పటికే పూర్తి కావాల్సి ఉన్నా.. కొన్ని చోట్ల నిర్లక్ష్యం కనిపిస్తోందన్నారు. నియోజకవర్గంలో మొత్తం 4వేల 2వందల 84 మంది కుటుంబ సాధికార సారధులను నియమించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 3వేల 822మందిని నియమించారన్నారు. మిగిలిన వారిని మరో నాలుగైదు రోజుల్లో నియమించాలన్నారు. మరోవైపు కో- కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇంచార్జిల నియామకం కూడా చేయాల్సి ఉందన్నారు. దీనిపై కూడా త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటామన్నారు. ఓటర్ జాబితాలో చేర్పులు మార్పులపై కూడా దృష్టి సారించాలని సూచించారు. కొన్ని చోట్ల పార్టీ విషయాల్లో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై ఎమ్మెల్యే సునీత ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ కోసం మనమంతా కష్టపడి పని చేయాలని.. ఎక్కడా నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. అధిష్టానం మనపై ఏ బాధ్యత ఉంచినా.. అది మనం పూర్తి చేయాలన్నారు. మరోవైపు మీ ప్రాంతంలో ప్రజల సమస్యలు తెలుసుకుని.. వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు. మనం ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారిదిగా ఉండాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు...

## గోవిందరాజస్వామివారి
## ఆలయంలో ఘనంగా శ్రీ భాష్యకార్ల ఉత్సవం

**అంకుశం న్యూస్ తిరుపతి ఏప్రిల్ 23:** తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో శ్రీ భాష్యకార్ల( శ్రీ రామానుజాచార్యులు) ఉత్సవం బుధవారం ఘనంగా ప్రారంభమైంది. మే 2వ తేదీ వరకు పది రోజుల పాటు ఈ ఉత్సవం జరుగనుంది. ఇందులో భాగంగా ప్రతిరోజు ఉదయం 7.30 నుండి 8.30 గంటల వరకు భాష్యకార్ల వారిని బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్నమాడ వీధి ఉత్సవం, సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు పెద్దమాడవీధి ఉత్సవం నిర్వహిస్తారు. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, సాత్తుమొర, ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీమతి శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్స్పెక్టర్ ధనంజయ, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.





## తల్లి వర్ధంతి కి తనయుడు సేవాకార్యక్రమాలు

వెయ్యిమంది పేదలకు చీరల పంపిణీ చేసిన మల్లిబాబు



**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ ఏప్రియల్ 23:** ప్రతి సేవా కార్యక్రమాన్ని వినూత్నంగా నిర్వహించే సురుచి ఫుడ్స్ అధినేత, విద్యదాత పోలిశెట్టి మల్లి బాబు తన మాతృ మూర్తి వర్ధంతిని ప్రత్యేకంగా నిర్వహించారు. ఏటా నిర్వహించే విధంగా మండపేట మండలం తాపేశ్వరం సురుచి ఫుడ్స్ వద్ద సుమారు వేయి మందికి చీరల పంపిణీ చేశారు. అయితే ఈసారి కాస్త వినూత్నంగా మహిళలకు తమకు నచ్చిన చీరలు ఎంచుకునేలా అవకాశం కల్పించారు. అందుకు తగ్గ ఏర్పాట్లు చేశారు. దీంతో మహిళలు తమకు నచ్చిన చీరలు ఎంచుకుని మల్లిబాబు కు దీవెనలు అందించారు. కార్యక్రమంలో మల్లిబాబు సతీమణి భారతి, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్టికల్ హబ్బును, సోలార్ హబ్ గా మార్చడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం ..


– సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్



**అంకుశం న్యూస్ అనంతపురం ఏప్రిల్ 23:** అనంతపురం జిల్లాలోని రైతులు ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలని రైతులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి జగదీష్ కోరారుమంగళవారం స్థానిక సిపిఐ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి. జగదీష్ మాట్లాడుతూ, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాటలు అభ్యంతరకరమైన వ్యాఖ్యలు ఉపసంహరించుకోవాలి. ఇటీవల మడకశిరలో విద్యుత్ సబ్ స్టేషన్లు ,. తెలుగుదేశం పార్టీ కార్యాలయం ప్రారంభించడానికి వచ్చిన మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఉమ్మడి అనంతపురం జిల్లాలను సోలార్ హబ్ గా మారుస్తామని ప్రకటించినాడు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మరియు రాయలసీమలోనూ దేశంలో ఎక్కడ లేనివిధంగా 30 రకాల పండ్లు ఇక్కడ పండుతాయి. రైతులు పండించిన పండ్లను ఎగుమతి చేయడానికి గత ప్రభుత్వం మాజీ ఎంపీ రంగయ్య కిసాన్ రైలు ప్రారంభించినారు. ఆ రైలు ఢిల్లీ కి రైతులు పండించిన పండ్లను ఎగుమతి చేయడానికి ఉపయోగకరంగా ఉండేది.తర్వాత ఎంపీ అంబిక లక్ష్మీనారాయణ రైతుల ఉత్పత్తులను ఎగమతులు చేయడానికి కార్గో విమానాశ్రయం కూడా ఏర్పాటు చేస్తామని ప్రకటించారు .రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతి సభలోను ఉమ్మడి అనంతపురం జిల్లా ఇది ఆర్టికల్ హబ్ అని ప్రకటించుచున్నాడు ఆర్టికల్ హబ్ గా అధికారులకు వివరించడం జరిగింది. అట్లాంటప్పుడు ప్రభుత్వం లో మార్పు వచ్చిందా? అని జగదీష్ అన్నారు. సోలార్ హబ్బుగా మంత్రి చెప్పిన మాటల్లో చూస్తే అది వాస్తవమని అనిపిస్తుంది అని అన్నారు. హంద్రీనీవా కాలువ వెడల్పు చేస్తున్నారు ఇది సంతోషకరమైన విషయం. అయినప్పటికీ ఆయకట్టుకు నీరు ఇవ్వడానికి డిస్ట్రిబ్యూటర్లు ఏర్పాటు చేయకుండా రెండో దశలో కాంక్రీట్ పనులు చేస్తున్నారు. అలా చేయకుంటే కుప్పం వరకు నీరు చేరవు, అందువల్లనే కాంక్రీట్ పనులు చేస్తున్నామని ప్రభుత్వం చెబుతున్నది. హంద్రీనీవా కింద ఉన్న సుమారు 6 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వకుండా, కాంక్రీట్ పనులు చేస్తే భూగర్భ జలాలను అడుగంటి పోతాయి. ప్రస్తుతము అనంతపురం జిల్లాలో భూగర్భ జలాలు పెరిగి సంతృప్తిగా బోర్లు రీఛార్జ్ అయ్యి వ్యవసాయం జరిగేది. కాంక్రీట్ పనులు చేపడితే, హంద్రీనీవా కాలువను అధునీకరణ చేస్తే, అనంతపురం ,సత్య సాయి జిల్లాలుఎడారిగా మారుతాయి. వ్యవసాయ భూములను ఎడారిగా మార్చే ప్రక్రియకు ప్రభుత్వం చేపట్టి సోలార్ హబ్బుగా చేయాలని చూస్తున్నారా? అని జగదీష్ మండిపడ్డారు. ఉమ్మడి అనంతపురంలో సోలార్ హబ్ గా చేయాలని చూస్తున్నారు. అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాలో వ్యవసాయ భూములను కార్పొరేట్ వాళ్లకి సంవత్సరానికి 30,000 వేలు ఎకరాకు ఇస్తూ 30 సంవత్సరాలు వారికి కట్టబెడితే పొలాలన్నీ కాంక్రీట్ తో సోలార్ తొ నిండిపోతాయి. అలాంటప్పుడు ఈ రెండు జిల్లాలకి హంద్రీనీవా నీరు ఏమిటికి ఉపయోగపడవు అందుకని ఆయకట్టుకు నీళ్లు ఇవ్వకుండా కాంక్రీట్ వేస్తున్నట్లు కనిపిస్తున్నది. చూస్తున్నారునీ మండిపడ్డారు. వ్యవసాయ భూములకు రెండు జిల్లాల్లో నీరు ఇవ్వము, ఆయకట్టు లేదు ,అని సంకేతాలు ఇస్తున్నారు .ఇది సరైనది కాదని జిల్లాకు ప్రత్యేకంగా ఆయకట్టుకు నీరు ఇవ్వాలని ఉంది. ఈ విషయంపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతామని తెలుపుతూ ఈ హంద్రీనీవా కాల్వను వెడల్పు చేస్తే పరిష్కారం అవుతుంది . అలా చేయకపోతే అన్ని రాజకీయ పార్టీలతో అఖిలపక్షం ఏర్పాటు చేసి,,పోరాటం చేస్తామని తెలిపారు.... ఈ ప్రెస్ మీట్ లో పాల్గొన్నవారు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ గారు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం వీరభద్ర స్వామి సిపిఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి బి మహేష్ సిపిఐ పట్టణ కార్యదర్శి ఎస్ గోపీనాథ్ సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్ రూరల్ కార్యదర్శి రాము రాయల్ రూరల్ సహాయ కార్యదర్శి రామాంజనేయులు ఏఐటీయూసీ మండల కార్యదర్శి ఈశ్వరయ్య ఏఐటియుసి మండల ఉపాధ్యక్షులు మల్లయ్య

## చేనేత కు గిర్రాజు రవి చేసిన కృషి మరువలేనిది

– 15 వార్డు టీడీపీ చేనేత నాయకులు పల్లెం కృష్ణ



**అంకుశం న్యూస్ ధర్మవరం ఏప్రిల్ 23:** ధర్మవరం చేనేత పరిశ్రమ రంగానికి యువకుడు పట్టు చీరల సంఘం అధ్యక్షులు గిర్రా జు రవి చేసిన కృషి మరువలేనిది అని ధర్మవరం టీడీపీ 15 వార్డు చేనేత నాయకులు పల్లెం కృష్ణ పేర్కొన్నారు. ఏదైనా సమస్య వస్తే పరిష్కారం దిశ గా ఆలోచించే స్వభావం కల రవి సేవలు అవసరం అని ఆయన రాజీనామా చేయడం ఎవరికీ ఇష్టం లేదని ఈ రాజీనామా ఆమోదం కాదని తిరిగి ఈ బాధ్యతలు ఆయనకే అప్పగిస్తామని అన్నారు.

## ఏప్రిల్ 30 నుంచి మే 2వ తేదీ వరకు శ్రీ భగవద్ రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు

**అంకుశం న్యూస్ తిరుపతి ఏప్రిల్ 23:** అన్నమాచార్య కళామందిరంలో టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఏప్రిల్ 30 నుంచి మే 2వ తేదీ వరకు శ్రీ రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు శ్రీ భగవద్ రామానుజాచార్యులపై సాహితీ సదస్సు, సంగీత కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఏప్రిల్ 30వ తేదీ సాయంత్రం 5.30 గంటలకు తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామివారి మంగళశాసనాలతో శ్రీ రామానుజాచార్యుల అవతార మహోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం పలువురు ప్రముఖుల ఉపన్యాసాలు, భక్తి సంగీత కార్యక్రమాలు జరుగనున్నాయి.